# తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలి..

## వైరా మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మదన్‌లాల్

వైరాటౌన్, మే 1 : అకాల వర్షంతో తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని వైరా మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్ డిమాండ్ చేశారు. సిరిపురం నుంచి దాచాపురం వరకు సుమారు 16 కిలో మీటర్ల మేర రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యాన్ని గురువారం ఆయన పరిశీలించారు. అకాల వర్షంతో ధాన్యాన్ని కాపాడుకునేందుకు నానా పాట్లు పడుతున్నామని, ఆ ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసేలా చూడాలని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మదన్‌లాల్.. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు ఫోన్ చేసి రైతుల ఇబ్బందులు, తడిచిన ధాన్యం గురించి వివరించారు. తడిచిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని మదన్‌లాల్ కోరారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు బాణాల వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జున్‌రావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, బీఆర్‌ఎస్ నాయకులు కామినేని శ్రీనివాసరావు, లాల్‌మహ్మద్, కారుకొండ బోస్, తన్నీరు కిషోర్, అయినాల కనకరత్నం, వాసిరెడ్డి రవి ఉన్నారు.


ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ, హరిసింగ్‌నాయక్ దంపతులు ఎర్రవల్లిలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. హరిప్రియ తన పుట్టిన రోజు సందర్భంగా కేసీఆర్ ఆశీర్వాదం అందుకున్నారు.


# రేషన్ కార్డుల పేరిట ముప్పు తిప్పలు

**రేషన్ కార్డుల పేరిట ఉమ్మడి జిల్లా ప్రజలను రేవంత్ ప్రభుత్వం ముప్పు తిప్పలు పెడుతోంది. పాత కార్డుల్లోని పేర్లు ఆగమేఘాలమీద తొలగిస్తున్న కాంగ్రెస్ సర్కారు.. కొత్త కార్డులు మాత్రం సకాలంలో ఇచ్చిన పాపానపోలేదు. పైగా కొత్త కార్డుల్లో పేర్లు జతకావాలంటే పాత కార్డుల్లోని పేర్లను తొలగించుకోవాలంటూ మెలికపెట్టింది. దీనిని నమ్మిన దరఖాస్తుదారులు.. పరుగున వెళ్లి పాత కార్డుల్లో పేర్లు తొలగించుకున్నారు. వెంటనే కొత్త కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నారు. కానీ.. నెలలు గడిచినా అతీగతీ లేదు. పైగా ఉమ్మడి కుటుంబం నుంచి వేరు పడిన వారి పేర్లను, కొత్త కాపురం పెట్టిన వారి పేర్లను తీసుకొని మళ్లీ ఉమ్మడి కుటుంబంలో చేర్చి జిల్లా ప్రజలకు చుక్కలు చూపిస్తోంది. ఇక సరికొత్త చిక్కులతో దరఖాస్తుదారులకు తలనొప్పి తెచ్చిపెడుతోంది. కొత్తగా వివాహమైన జంటలు సంతానం కలిగాక రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే ఆ సంతానంలో ఒకరి పేరును కార్డులో ఎక్కిస్తోంది. మరొకరి పేరును చేర్చడం లేదు. నలుగురి పేరుతో ఒకే సారి దరఖాస్తు చేసుకుంటే అందులో ఒకరి పేరును ఎలా ఎగరగొడతారంటూ దరఖాస్తుదారులు ప్రశ్నిస్తున్నారు.**

*-ఖమ్మం, నమస్తే తెలంగాణ ప్రతినిధి/ భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ, మే 1*



పాత రేషన్ కార్డులో ఉన్న ముగ్గురి పేర్లు



కొత్త కార్డుకి దరఖాస్తు చేసుకున్నప్పటికీ మళ్లీ పాత కార్డులో కలిసిన మరో రెండు పేర్లు

- **పాత కార్డుల్లో పేర్లు తొలగించారు.. కొత్తవి ఇచ్చిన పాపాన పోలేదు..**
- **వివాహమై వేరుపడిన కొడుకు పేరు అతడి తల్లిదండ్రుల కార్డులో ప్రత్యక్షం**
- **'రెంటికీ చెడ్డ రేవడి'లా కొత్త కోడళ్ల పరిస్థితి.. రెండుచోట్లా పేర్లు గల్లంతు..**
- **తల్లిగారి కార్డులో పేరు తొలగించుకుంటే అత్తగారి కార్డులో చేర్చనేలేదు**
- **'కొత్త కాపురం పెట్టాం.. కార్డు ఇవ్వండి మహా ప్రభో..' అంటే అతీగతీలేదు**
- **పథకాలకు, సన్న బియ్యానికి 'కార్డు'తో లింకు.. ఇచ్చినవి మాత్రం అతిస్వల్పం**

### 'రెంటికీ చెడ్డ రేవడి'లా..

ఇక కొత్త కోడళ్ల పరిస్థితైతే 'రెంటికీ చెడ్డ రేవడి'లా ఉంది. వివాహమై అత్తగారింటికొచ్చిన కొత్త కోడళ్లు తమ అత్తగారి కుటుంబంలోగానీ, లేదా తన భర్తతో వేరుగా గానీ రేషన్ కార్డు కావాలంటూ మీసేవలో దరఖాస్తు చేసుకుంటున్నారు. అయితే అవి ఎప్పటికీ ఆమోదం పొందడం లేదు. నెలల తరబడి వేచి చూసి కార్యాలయాలకు వెళ్లి అధికారులను అడిగితే.. 'మీ తల్లిగారి కార్డులో మీ పేరు ఉంది. మొదట దానిని తొలగించుకోవాలి. ఆ తరువాత అత్తగారి కార్డులో పేరు జతపర్చేందుకుగానీ, భర్తతో కలిపి కొత్త కార్డు మంజూరుకుగానీ దరఖాస్తు చేసుకోవాలి. అప్పుడు ప్రభుత్వ ఆమోదం పొందితే నూతన కార్డు వస్తుంది' అని వివరంగా చెబుతున్నారు. ఈ మాటలు నమ్మిన కొత్త కోడళ్లు పరుగు పరుగున వెళ్లి తమ తల్లిగారి కార్డుల్లో ఉన్న తమ పేర్లను డిలీట్ చేయించుకున్నారు. తిరిగొచ్చి కొత్త కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. కానీ.. నెలలు గడిచినా అవి ఆమోదం పొందడం లేదు. దీంతో ఇటు తమ పేర్లు తమ తల్లిగారి కార్డులోనూ లేక, అటు అత్తగారి కార్డులోనూ ఎక్కక 'రెంటికీ చెడ్డ రేవడి' అవుతున్నారు. పైగా ఇటీవల పలు పథకాలకు ప్రభుత్వం రేషన్ కార్డులనే ప్రామాణికంగా తీసుకోవడంతో ఆయా కార్డులో వీరి పేర్లు లేక సదరు పథకాలను కోల్పోతున్నారు. అదీగాక లక్షలాది రేషన్ కార్డులు ఇచ్చామంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నప్పటికీ వాస్తవంగా ఇచ్చినవి మాత్రం అతి స్వల్పంగానే ఉన్నాయి. ప్రజాపాలన, మీసేవల నుంచి చేసుకున్న దరఖాస్తులు అత్యధిక సంఖ్యలో ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. అవి అలా ఉండగానే సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం వంటి పథకాలను అమలు చేస్తుండడంతో వాటికి దరఖాస్తు చేసుకునేందుకు అనేకమంది అర్హత కోల్పోతున్నారు.

### ఎన్నెన్నో తిప్పలు..

భాషా–ఆషా దంపతులేగాక ఇలాంటి తిప్పలను ఉమ్మడి జిల్లాలో ఇంకా ఎందరో దంపతులు ఎదుర్కొంటున్నారు. వేంసూరుకు చెందిన భాగ్యమ్మది, ఖమ్మం రూరల్‌కు చెందిన నాగరత్తమ్మది, జూలూరుపాడు మండలం చింతలతండాకు చెందిన రాములుది, అదే గ్రామానికి చెందిన పాలూరి రాంబాబుది ఇలాంటి సమస్యే. ఇలాంటి బాధితులు జిల్లాలో ఇంకా వేల సంఖ్యలో ఉన్నారంటే అతిశయోక్తి కాదు. కొత్త రేషన్ కార్డులు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పెడుతున్న ముప్పుతిప్పల వల్ల తలలు పట్టుకుంటున్నారు.

### మచ్చుకు ఓ ఉదాహరణ..


పాత కార్డును చూపిస్తున్న దంపతులు

అన్నపురెడ్డిపల్లి మండలానికి చెందిన షేక్ రంజాన్‌బీ–లాల్ అహ్మద్ అనే వారు వృద్ధ దంపతులు. వీరి కొడుకు భాషా. ఇతడికి వివాహమై ఐదారేళ్లు అవుతోంది. అయితే అతడికి వివాహం కాకముందు ఆ వృద్ధ దంపతులైన రంజాన్‌బీ, లాల్ అహ్మద్‌తోపాటు భాషాలకు కలిపి ముగ్గురి పేరుతో రేషన్ కార్డు ఉంది. అయితే ఐదారేళ్ల క్రితం భాషాకు వివాహమైంది. ఆ కుటుంబంలోకి అతడి భార్య ఆషా వచ్చింది. తరువాత భాషా–ఆషా దంపతులకు పెద్ద కొడుకుగా ఆయాన్, చిన్న కొడుకుగా ఆరిఫ్ జన్మించారు. కొన్నాళ్లకు భాషా–ఆషా దంపతులు వేరు కాపురం పెట్టుకున్నారు. వారి కుమారులైన ఆయాన్, ఆరిఫ్‌లతో కలిపి భాషా, ఆషా దంపతులు కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరి దరఖాస్తును చాన్నాళ్లపాటు పెండింగ్‌లో పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల దానిని ఆమోదించింది. ఆన్‌లైన్‌లో పరిశీలించుకున్న భాషా–ఆషా దంపతులకు దిమ్మతిరిగింది. భాషా–ఆషా దంపతులు, వారి ఇద్దరు కుమారులు కలిపి నలుగురి పేరిట కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే.. భాషా–ఆషా దంపతుల పేర్లతోపాటు వారి చిన్న కుమారుడైన ఆరిఫ్ పేరును తీసుకెళ్లి వృద్ధ దంపతులైన రంజాన్‌బీ–లాల్ అహ్మద్‌ల పాత కార్డులో చేర్చింది కాంగ్రెస్ ప్రభుత్వం. తాము దరఖాస్తు చేసుకున్న కొత్త కార్డును రేవంత్ సర్కారు ఇవ్వకపోగా.. తమ పెద్ద కుమారుడి పేరును ఎగరగొట్టిందని భాషా–ఆషా దంపతులు మండిపడుతున్నారు. పైగా వేరు కాపురం పెట్టుకున్న తమ పేర్లను తీసుకెళ్లి ఆ వృద్ధ దంపతుల కార్డులో ఎలా చేరుస్తారంటూ నిలదీస్తున్నారు. తమ పేరిట కొత్త కార్డు ఎప్పుడిస్తారని, అందులో తమ పెద్ద కుమారుడి పేరును ఎప్పుడు చేరుస్తారని భాషా–ఆషా దంపతులు ప్రశ్నిస్తున్నారు.

### ఉన్న కార్డును తొలగించారు..



నా పేరు బానోతు దీప. మాది ఇల్లెందు పట్టణం. మాకు గతంలో రేషన్ కార్డు ఉంది. ఇప్పుడు మా ఇద్దరి పిల్లల పేర్లు చేర్చడానికి ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నాం. ఎనిమిది నెలలుగా మాకు బియ్యం ఇవ్వడం లేదు. దీనిపై డీలర్‌ను ప్రశ్నిస్తే.. మీ కార్డు తొలగించారని చెప్పారు. పిల్లల పేర్లు చేర్చాలని దరఖాస్తు చేసుకుంటే.. ఉన్న కార్డు తొలగించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. మా పిల్లల పేర్లు చేర్చి కొత్త కార్డు ఇచ్చి ఆదుకోవాలి.

### పలుమార్లు దరఖాస్తు చేసుకున్నాం..



రేషన్ కార్డు కోసం ఇప్పటికే పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా. కార్డు అందిస్తామని ప్రభుత్వం చెబుతున్న మాటలన్నీ మాయగానే ఉన్నాయి. మాకు రేషన్ కార్డు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందడం లేదు. నిరుపేద కుటుంబాల ప్రజలు రేషన్ కార్డు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై రోజురోజుకూ ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతోంది. ప్రభుత్వం వెంటనే రేషన్ కార్డులు అందించి ఆదుకోవాలి.

**– వీరకృష్ణ, అడసర్లపాడు, వేంసూరు మండలం**

### దరఖాస్తు చేసినా కార్డు రాలేదు



నాకు పెళ్లయి పిల్లలు ఉన్నారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత రేషన్ కార్డులు వస్తాయన్నారు. ప్రజా పాలనలో దరఖాస్తు కూడా చేశాను. కానీ.. ఇంతవరకు కార్డు రాలేదు. మానాన్న వాళ్ల కార్డులో మా పేర్లు కలిసి ఉన్నట్లు ఆన్‌లైన్‌లో కార్డు నమూనా ఇచ్చారు. మార్పు కోసం మీసేవ సెంటర్‌కు చాలాసార్లు వెళ్లాను. పనులు మానేసి కార్యాలయాల చుట్టూ తిరగడం చాలా ఇబ్బందిగా ఉంది.

**–షేక్ భాషా, అన్నపురెడ్డిపల్లి**

### కార్డులు ఇస్తారా? లేదా?



అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు ఇస్తామని ప్రభుత్వం చెబితే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశాం. కానీ.. ఇప్పటివరకు ఎలాంటి కార్డు రాలేదు. అధికారులను ఎప్పుడు అడిగినా వస్తుందని చెబుతున్నారే తప్ప కార్డు మాత్రం రావడం లేదు. అసలు కార్డులు ఇస్తారా? లేదా? అనేది ఏదో ఒకటి చెప్పాలి. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇన్ని సమస్యలను చూడాల్సి వస్తుందనుకోలేదు.

**–ఆకుల నందిని, అయ్యన్నపాలెం, చంద్రుగొండ మండలం**

# గాలివాన బీభత్సం

- **రఘునాథపాలెం, కారేపల్లిలో నేలవాలిన బొప్పాయి తోటలు**
- **బచ్చోడు కొనుగోలు కేంద్రంలో తడిచిన ధాన్యపు రాసులు**
- **తడిచిన ధాన్యం ప్రభుత్వమే కొనాలి : న్యూడెమోక్రసీ డిమాండ్**

రఘునాథపాలెం/ కారేపల్లి/ తిరుమలాయపాలెం, మే 1: ఖమ్మం జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం రాత్రి ఈదురుగాలులతో కురిసిన వర్షం రైతులకు అపార నష్టాన్ని మిగిల్చింది. కల్లాల్లో రైతులు ఆరబెట్టిన ధాన్యం తడిచిపోగా.. చేతికొచ్చిన బొప్పాయి తోటలు విరిగిపోయాయి. కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. రఘునాథపాలెం మండలంలో బొప్పాయి తోటలు నేలవాలాయి. సూర్యాతండాలో రైతులు సాగు చేసిన బొప్పాయి తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. రైతు వాంకుడోతు బాలకు చెందిన సుమారు పది ఎకరాల బొప్పాయి తోట పూర్తిగా నేలకొరిగింది. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని వేడుకున్నాడు. కారేపల్లి క్రాస్‌రోడ్‌లో భూక్యా శంకర్ ఐదెకరాలు కౌలుకు తీసుకొని సాగు చేసిన బొప్పాయి తోట గాలివాన బీభత్సానికి నేలకొరిగింది. దాదాపు రూ.10 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు రైతు శంకర్ వాపోయాడు. మండలంలోని పలు ప్రాంతాల్లో అక్కడక్కడా వరి, మొక్కజొన్న, మిరప తోటలు దెబ్బతిన్నాయి. భారీ వృక్షాలు, పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలమట్టమయ్యాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. తిరుమలాయపాలెం మండలం బచ్చోడు ధాన్యం కొనుగోలు కేంద్రంలో పట్టాలు లేకపోవడంతో ధాన్యపు రాసులు తడిచిముద్దయ్యాయి. చుట్టుపక్కల గ్రామాల రైతులు సుమారు 3,500 క్వింటాళ్ల ధాన్యం విక్రయానికి తెచ్చారు. 15 రోజులు గడుస్తున్నా వడ్లు కొనేవారు లేరని రైతులు వాపోయారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ధాన్యం తడిచిపోయి రైతులు నష్టపోయారని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేశ్ తెలిపారు. తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.


కారేపల్లి : విరిగిపోయిన బొప్పాయి తోట


సూర్యాతండాలో నేలవాలిన వాంకుడోతు బాల బొప్పాయి తోట


కారేపల్లి : నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు


తడిచిన ధాన్యంలో నీటిని దోసిటితో ఎత్తిపోస్తున్న రైతులు

# 'నీట్'కు పకడ్బందీ ఏర్పాట్లు

- **జిల్లాలో ఆరు పరీక్ష కేంద్రాలు**
- **పరీక్ష రాయనున్న 2,739 మంది అభ్యర్థులు**
- **టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

ఖమ్మం, మే 1 : వైద్య విద్యలో ప్రవేశాలు కల్పించేందుకు ఈ నెల 4వ తేదీన నిర్వహించనున్న నీట్ పరీక్ష కోసం జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి నీట్ పరీక్ష నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ గురువారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 2,739 మంది విద్యార్థులు ఆరు కేంద్రాల్లో పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. పరీక్ష మే 4న మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని, విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. సీసీ టీవీ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసి పరీక్షను క్షుణ్ణంగా పర్యవేక్షించాలన్నారు. అభ్యర్థులందరూ మధ్యాహ్నం 1.30లోపే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డు ప్రింట్ అవుట్ తీసుకొని పరీక్ష కేంద్రాలకు రావాలని, ఇన్విజిలేటర్ ఒక కాపీ అడ్మిట్ కార్డు కలెక్ట్ చేసుకుంటారని తెలిపారు. అభ్యర్థులు https://neet.nta.nic.in పోర్టల్ నుంచి నీట్ ప్రవేశ పరీక్ష అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అడ్మిట్ కార్డు, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, పోస్ట్ కార్డు సైజు ఫొటో, ఫొటోతో కూడిన ఒరిజినల్ గుర్తింపు కార్డు(ఆధార్, పాన్, రేషన్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్) తప్పనిసరిగా తీసుకొని రావాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదని, విద్యార్థినులు ఆభరణాలు ధరించవద్దన్నారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, నీట్ పరీక్ష జిల్లా నోడల్ అధికారి నరేంద్ర, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

### నీట్ కేంద్రాల వద్ద సెక్షన్ 163 : సీపీ సునీల్ దత్

నీట్ పరీక్ష కేంద్రాల వద్ద ఈ నెల 4న మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 8 గంటల వరకు సెక్షన్ 163 బీఎన్‌ఎస్‌ఎస్ యాక్ట్ – 2023(భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో ఉంటుందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఒక ప్రకటనలో తెలిపారు. యాక్ట్ అమలులో ఉన్న సమయంలో పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా ఉండకూడదని సూచించారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు, మైకులు, డీజేలతో ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించొద్దని పేర్కొన్నారు. పరిసరాల్లోని ఇంటర్నెట్, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని, ఈ విషయంలో అన్ని వర్గాలు పోలీసులకు సహకరించాలని కోరారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

# దిగజారిన 'పది' స్థానం!

- **21వ స్థానంలో నిలవడానికి బాధ్యులు ఎవరు?**
- **తెలుగు, సైన్స్ సబ్జెక్టులలో ఎక్కువ మంది ఫెయిల్**
- **పది ఉత్తీర్ణతలో పెనుబల్లి టాప్.. కొణిజర్ల లాస్ట్..**

ఖమ్మం అర్బన్, మే 1 : జిల్లాను ఉత్తమ స్థానంలో నిలబెట్టాల్సిన పదో తరగతి ఫలితాలు తీవ్ర నిరాశ పరిచాయి. హైదరాబాద్ తర్వాత ఎడ్యుకేషన్ హబ్‌గా పేరున్న ఖమ్మం జిల్లా పది ఫలితాల్లో 21వ స్థానానికి దిగజారడానికి అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నది. విద్యార్థులు ఎక్కువగా తెలుగు, సైన్స్‌లో ఫెయిల్ అయ్యారంటే పరిస్థితి ఏ స్థాయిలో అర్థమవుతున్నది. విద్యాసంవత్సరం ప్రారంభంలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ చేపట్టారు. తర్వాత ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించి నియామకాలు చేసినప్పటికీ సర్దుబాటు ఉపాధ్యాయుల డిప్యూటేషన్ మాత్రం రద్దు చేయలేదు. ఒక టీచర్ అవసరమైన చోట చాలా స్కూళ్లలో సర్దుబాటు టీచర్లు, నూతనంగా నియామకమైన టీచర్లు ఉన్నప్పటికీ ఆశించిన ఫలితాలు సాధించలేకపోయారనేది స్పష్టమవుతున్నది. ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాల్సిన అధికారులు ఆ స్థాయిలో అడుగులు వేయలేకపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### తెలుగు, సైన్స్‌లో ఫెయిల్..

ఈ దఫా పరీక్షల్లో తెలుగులో ఫెయిలైన విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంది. జిల్లాలో తెలుగు 393, హిందీ 38, ఇంగ్లిష్ 111, గణితం 245, సైన్స్ 471, సోషల్ 104 మంది ఫెయిల్ అయ్యారు. వారిలో ఎక్కువ మంది సైన్స్, తెలుగులోనే ఉన్నారు. ఫెయిలవుతున్న విద్యార్థుల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని పరిస్థితిని చక్కదిద్దాల్సిన అధికారులు అందుకు కార్యాచరణ మాత్రం రూపొందించలేకపోతున్నారు.

### పెనుబల్లి టాప్.. కొణిజర్ల లాస్ట్..

ఎన్ని ప్రత్యేక చర్యలు తీసుకున్నా.. కలెక్టర్ పలుమార్లు సమావేశాలు నిర్వహించినా.. 10 స్కూళ్లలో 70 శాతంలోపే ఫలితాలు వచ్చాయంటే పర్యవేక్షణలో లోపం ఉన్నట్లు కనిపిస్తున్నది. రాష్ట్ర సగటు ఉత్తీర్ణత 92.78 శాతం ఉంటే.. జిల్లాలో రాష్ట్ర సగటు కంటే తక్కువ వచ్చిన స్కూళ్లు 124 వరకు ఉన్నాయి. పెనుబల్లి మండలంలో 14 స్కూళ్లలో 564 మందికి 557 మంది ఉత్తీర్ణత సాధించి 98.76 శాతంతో టాప్‌గా నిలిచింది. కొణిజర్ల మండలంలోని 16 స్కూళ్లలో 641 మందికి 520 మంది ఉత్తీర్ణత సాధించారు. 119 మంది ఫెయిల్ అయి 81.38 శాతంతో చివరన నిలిచింది.

### పదిలో వంద శాతం సాధించిన స్కూళ్లు 65

జిల్లాలో ప్రభుత్వ 21, జిల్లా పరిషత్ 190, కేజీబీవీ 14.. మొత్తం 225 పాఠశాలలు ఉన్నాయి. పదో తరగతి ఫలితాల్లో మాత్రం నూరు శాతం ఉత్తీర్ణత సాధించినవి కేవలం 65 పాఠశాలలే ఉన్నాయి. నూరు శాతం ఫలితాలు సాధించిన వాటిలో ప్రభుత్వ పాఠశాల 1, జిల్లా పరిషత్ స్కూళ్లు 61, కేజీబీవీలు 3 ఉన్నాయి. ప్రైవేట్, ఇతర యాజమాన్యాలున్న స్కూళ్లలో 105 స్కూళ్లు నూరు శాతం ఫలితాలు సాధించాయి. జిల్లాలో 424 స్కూళ్లలో 170 స్కూళ్లు సెంట్ పర్సంట్ రిజల్ట్స్ నమోదు చేశాయి.

